
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
గురువారం | 25 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 5

## పూలనే దైవంగా పూజించే పండుగ బతుకమ్మ ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి):** సంస్కృతికి, సంప్రదాయాలకు నిలయమైన బతుకమ్మ పండుగ విశిష్టత అంతా,ఇంతా కాదని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకలు జిల్లా పరిషత్ మహిళ పాఠశాలలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరైనారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో...



- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్,సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి.
- గిడ్డంగుల సంస్థ సామర్థ్యం మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల పెంపుకు చర్యలు
- సంవత్సర కాలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పూర్తి చేస్తాం
- ఖమ్మం రూరల్ మండలం యం. వెంకటాయపాలెంలో శీతల గోదాముల నిర్మాణానికి శంకు స్థాపన చేసిన మంత్రి పొంగు లేటి.


## రైతును రాజు చేయడమే లక్ష్యంగా..
# ప్రభుత్వ కార్యాచరణ

**ఖమ్మం రూరల్ ప్రజాజ్యోతి :** రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రివర్యులు,బుధవారం ఖమ్మం రూరల్ మండలం యం.వెంకటాయపాలెం గ్రామంలో 15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 9 వేల 700 మెట్రిక్ టన్నుల శీతల గోదాముల నిర్మాణానికి జిల్లా కలెక్టర్, సిపి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 10 సంవత్సరాల కాలంలో గత పాలకులు గిడ్డంగుల సామర్థ్యం 3 లక్షల మెట్రిక్ టన్నుల పెంచితే, మన ప్రజా ప్రభుత్వం 5 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులు చేపట్టిందని, రాబోయే 3 సంవత్సరాలలో వీటిని పూర్తి చేస్తామని అన్నారు.గిడ్డంగుల సంస్థ ద్వారా గతంలో ఎన్నడు లేని విధంగా మొట్టమొదటిసారిగా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, 9700 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కోల్డ్ స్టోరేజ్ ను 15 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని, సంవత్సర కాలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పూర్తి చేసి, వాణిజ్య పంటలు పండించే రైతన్నలకు ప్రైవేటు కంటే అతి చౌకగా కోల్డ్ స్టోరేజ్ అందుబాటు లోకి తీసుకుని వస్తామని అన్నారు.రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయలు రైతుల రుణమాఫీ

మిగతా 2 లో...

## ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి : డా. బి. కళావతి బాయి

- తప్పలగూడెం బస్తీ దవాఖాన ఆకస్మిక పర్యవేక్షణ
- ఓల్డ్ మునిసిపాలిటీ ఆమ్ ఏ.ఏ.ఎం.సెంటర్ సందర్శన మెడికల్ కాలేజీ, ఖమ్మం
- ప్రజలకు నాన్యమైన వైద్యసేవలు ఆలస్యం లేకుండా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాము.
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి



2 లో...

## ఈ జన్మకు ఇది చాలు.. నా కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

- గృహనిర్మాణ శాఖకు మంత్రి కావడం పూర్వజన్మ సుకృతం పేదల సొంతింటి కల నెరవేర్చే అవకాశం రావడం నా అదృష్టం.
- -ఆరెంపులలో వేడుకగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.



**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చూస్తుంటే ఆనందంతో తన కళ్లు చెమ్మ గిల్లుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ జీవితానికి భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశంతో మనసు ఉప్పొంగుతోందని, ఈ జన్మకు ఇంతకంటే మధురక్షణాలు లేవన్నారు. పాలేరు నియోజకవర్గంలోని ఆరెంపుల గ్రామంలో బుధవారం జరిగిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి గారు భావోద్వేగం తో మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల గురించి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబితే ప్రతిపక్షాలు హేళన చేశాయని అన్నారు. ఈ ప్రభుత్వానికి నిధులు లేవని కేవలం ఇళ్ల కోసం కాగితం ముక్కలిచ్చి ప్రజలను మోసం చేస్తారని ఎద్దేవా చేశారని గుర్తుకు చేశారు. అవన్నీ వట్టిమాటలే అని నిరూపిస్తూ ఇప్పుడు రాష్ట్రంలో 4.50 లక్షల ఇండ్లను

మిగతా 2 లో...

## పూలనే దైవంగా పూజించే పండుగ బతుకమ్మ ఎమ్మెల్యే రాగమయి



(మొదటి పేజీ తరువాయి...)

ఆటలు ఆడి, బతుకమ్మను ఎత్తుకొని, అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలనే దైవంగా పూజించే విశిష్టమైన బతుకమ్మ పండుగ అని, ప్రతి కుటుంబంలో, ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించి, అభివృద్ధిలో ముందు ఉంచుతున్నారని అన్నారు. భావితరాలకు ఇలాంటి సంస్కృతులు అలవాటు చేయాలని తెలియజేశారు. అనంతరం ప్రతి ఒక్కరికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ నరసింహ,ఎఫ్ డి ఓ మంజుల సిడిపిఓ మెహర్ ఉన్నీసా బేగం, కళాశాల ప్రిన్సిపల్,ప్రజా ప్రతినిధులు అధికారులతో పాటు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమా ఆనంద్ బాబు,, చల్లగుండ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, కమల్ పాషా,గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, గఫార్,కాంగ్రెస్ నాయకులు,అభిమానులు ఉన్నారు.

# రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి...)

పూర్తి చేసామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు.రైతులను రాజు చేయడమే లక్ష్యంగా నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నా మని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల యూరియా సమస్య ఏర్పడితే ఢిల్లీలో రైతుల పక్షాన పోరాటం చేసి రైతులకు యూరియా సరఫరా చేసామని, రాబోయే వారం రోజులలో యూరియా సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశామని తెలిపారు.గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను మోసం చేస్తే మన ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో మొదటి విడతలో 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన అర్హులకు కూడా తదుపరి విడతల్లో తప్పని సరిగా ఇండ్లు మంజూరు చేస్తామని, మరో 3 సార్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధులు బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్నామని అన్నారు. అర్హులైన నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 15 కోట్ల అంచనాతో చేపట్టిన కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకోవడం సంతోషకరమని, కోల్డ్ స్టోరేజ్ కోసం అవసరమైన 10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని, మంత్రి ఆదేశాల మేరకు కోల్డ్ స్టోరేజ్ కు డబుల్ లైన్ రోడ్డు అనుసంధానం చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంతో స్థానికంగా రైతులకు మేలు జరుగుతుందని, ఉద్యానవన శాఖ పంటల ఉత్పత్తి పెరుగుతుందని, మిర్చి రైతులకు కూడా కోల్డ్ స్టోరేజ్ ఉపయోగ పడుతుందని అన్నారు. రైతులు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం కానున్న నేపథ్యంలో పంటల మార్పిడి విధానం అమలు చేయాలని, లాభాదాయక పంటల సాగు వైపు దృష్టి సారించాలని అన్నారు.పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ గిడ్డంగుల శాఖ ఆధ్వర్యంలో పెద్ద గోడౌన్ రైతులకు అందుబాటులోకి వచ్చి భవిష్యత్తులో రైతులు మార్కెట్లో పంట మంచి ధర సాధించేందుకు కోల్డ్ స్టోరేజ్ మంచి అవకాశం లభిస్తుందని అన్నారు.కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంతో ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బాటలు పడతాయని సిపి ఆకాంక్షించారు.రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు మాట్లాడుతూ స్థానిక రైతులకు ఉపయోగపడే విధం గా కార్పోరేషన్ చరిత్రలో మొట్టమొదటి సారిగా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, దీనిని రైతులు పూర్తి స్థాయిలో ఉపయోగించు కోవాలని అన్నారు. మంత్రి సూచనల మేరకు రాష్ట్రంలో మరో 5 లక్షల టన్నుల గోదాములు నిర్మించి గిడ్డంగుల సంస్థ సామర్థ్యం 10 లక్షల టన్నులకు పెంచేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే మూడు లక్షల టన్నుల గోదాములు నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండి కొర్ర లక్ష్మి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు వివిధ శాఖల అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుర్తించాలి

**ఖమ్మం రూరల్, ప్రజాజ్యోతి:** స్థానిక ఖమ్మం రూరల్ మండలం ఏదులపురం రెవెన్యూలోని సర్వే నెం. 136 వద్ద 23.09.2025న మధ్యాహ్నం 2:30 గంటలకు జరిగిన ఈ ఘటన 24.09.2025న సాయంత్రం 4:00 గంటలకు ఫిర్యాదుదారుడు పిల్లి రామ్ ప్రసాద్, తహశీల్దార్, ఖమ్మం రూరల్ మండలం. 9849906080 ద్వారా నివేదించబడింది. నిందితులు. బానోత్ కృష్ణ తండ్రి గిస్కా గ్రామం పెద్ద తండా, బానోత్ బాలాజీ తండ్రి గిస్కా, రెసిడెన్షియల్ పెద్ద తండా,యేపురి తరుణ్ తండ్రి వెంకటేశ్వర్లు గ్రామం ఏదులపురం ప్రభుత్వ భూమిలో ప్రీ–కాస్ట్ ఫెన్సింగ్ వేస్తున్నారు, ఆ ఫిర్యాదుదారు ని ఇక్కడ ప్రీ–కాస్ట్ ఫెన్సింగ్ ఎందుకు వేస్తున్నారని అడిగారు. ఈ ప్రాంతానికి తమకు ఒక అసైన్ మెంట్ ఉందని నిందితులు చెప్పారు. ఆ ఫిర్యాదుదారుడు వారికి అసైన్ మెంట్ ఇచ్చి, మిగిలిన ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుర్తించాలని చెప్పారు. అప్పటి వరకు, ఈ భూమిని ఆక్రమించవద్దని లేదా కంచె వేయవద్దని మాకు చెప్పారు.అప్పుడు ఫిర్యాదుదారుని,అతని సిబ్బందిని అసభ్యకరమైన భాషలో దుర్భాషలాడారు. మాతో ఉన్న పోలీసు సిబ్బందిని ఎటువంటి వీడియోలు లేదా ఫోటోలు తీయవద్దని బెదిరించారు.ప్రజా కార్యక్రమాల నిర్వహణలో అడ్డుకున్నారు.ఇట్టి విషయం లో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పైన చెప్పిన వ్యక్తుల పై కేసు నమోదు చేయడం జరిగింది.

## ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి : డా. బి. కళావతి బాయి

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** బుధవారం ఉదయం పది గంటలనుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి నగరంలోని పలు ఆరోగ్య కేంద్రాలను సంధర్శించారు. యు.పి.హెచ్ .సీ. ముస్తఫానగర్ పరిధి లోని తప్పలగూడెం బస్తీ దవఖానను ఆకస్మికంగా సంధర్శించి వైద్య సేవల కోసం బస్తీ దవఖానకు వచ్చిన పేషంట్లతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులు, అక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓ.పీ. రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ మరియు ఇతర రిజిస్టర్లను, ఆరోగ్య కేంద్రం సేవలను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. డ్యూటి సమయంలో పేషంట్లతోని మంచిగా ప్రవర్తించాలని, సెల్ ఫోన్ వాడకం తగ్గించి పేషంట్లతో నేరుగా మాట్లాడి వారికి సేవలు అందించాలని,నిర్లక్ష్యంగా ఉండవద్దని, సీజనల్ వ్యాధుల పట్ల ముఖ్యంగా డెంగీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఓల్డ్ మునిసిపాలిటి ఆమ్ ఏ.ఏ.ఎం.సెంటర్ ను సందర్శిచారు. అక్కడ చేస్తున్న కార్యకలాపాలను సమీక్షించారు. సిబ్బందితో మాట్లాడి, ప్రజలకు అందిస్తున్న సేవలను గమనించారు.నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని, ప్రజలకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, మన సేవల్ని నమ్మకొని వస్తున్న పేషంట్టను జాగ్రత్తగా రిసీవ్ చేసుకొని చిరునవ్వుతో పలకరించాలని,సీనియర్ సిటిజెన్లకు, గర్భిణీ స్త్రీలకు సరైన వసతులు కల్పించాలని కోరారు.ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీని సందర్శించి హెపటైటిస్ – బి టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెడికల్ కాలేజ్ విద్యార్థినీ విద్యార్థులకు, ఆఫీస్ సిబ్బందికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ ఆదేశాల మేరకు హెల్త్ కేర్ ప్రొవైడర్లకు హెపటైటిస్ – బి ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా టీకాలు వేయడం జరిగినది. హెపటైటిస్–బి అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వైరల్ వ్యాధి. రక్తం మరియు శరీర ద్రవాలతో ప్రత్యేక్ష సంబంధం కారణంగా హెల్త్ కేర్ వర్కర్స్ ఈ వ్యాధికి ఎక్కువగా ప్రమాదానికి లోనవుతారని తెలిపారు. ఈ








వ్యాధి నుండి రక్షణ పొందడానికి టీకా అత్యంత సురక్షితమైన, ప్రభావవంతమైన మార్గమని తెలియజేశారు. కాలేజీ సిబ్బందికి స్వయంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి. కళావతి బాయి హెపటైటిస్–బి టీకాలను వేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి. శంకర్, అదనపు డీ.ఎం. హెచ్.ఓ. డా. వెంకటరమణ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.ప్రజలకు నాన్యమైన వైద్యసేవలు ఆలస్యం లేకుండా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాము.ప్రజలను ఆరోగ్యవంతులు చేయడమే మా లక్ష్యం.ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం మని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.బి.కళావతి బాయి తెలిపారు.

# ఈ జన్మకు ఇది చాలు.. నా కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

(మొదటి పేజీ తరువాయి...)

నియోజకవర్గానికి 3500 చొప్పున మంజూరు చేయడమగాక ఇప్పుడు గృహప్రవ శాలు చేసుకోవడం ఆనందాయక మన్నారు. స్వర్గీయ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు గతంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లను కట్టించారని పేర్కొన్నారు. ఇప్పుడు గౌరవ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ పథకాని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క , సహచర మంత్రులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా ముందుకు సాగుతోందని అన్నారు. పాలేరు నియోజక వర్గ ప్రజల అభిమానంతో ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర మంత్రి వర్గంలో పేదలకు గూడు కల్పించే హౌసింగ్ శాఖకు మంత్రి కావడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు కడితే కమీషన్లు రావన్న ఆలోచనతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి భారీ అవినీతికి పాల్పడిందన్నారు. ఏకంగా గృహ నిర్మాణశాఖను చీలికలు పేలికలు చేసి చివరికి ఆ శాఖనే లేకుండా చేసిందన్నారు. అప్పటికి ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో ఏడాదికి లక్ష ఇండ్లు కట్టినా పదేళ్లలో పేదలకు పది లక్షల ఇండ్లు దక్కేవని, అయితే కేవలం ధనాశతో ఈ పథకాన్ని పక్కన పెట్టారని ఆరోపించారు. కమీషన్ల కక్కుర్తితో కాళేశ్వరానికి పునాది వేసిందీవారే, ప్రారంభించిందే వారేనని అన్నారు అయితే భగవంతుడు ఈ అన్యాయాన్ని చూసినందున ఆ ప్రభుత్వాధినేత దొరవారు దిగిపోయే నెలన్నర ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని తెలిపారు. దీంతో వారి వ్యవహారం బట్టబయిలైందన్నారు. ఈ ప్రాజెక్ట్ లో అవినీతిపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో విచారణ జరిపిస్తే వారి అవినీతి కథకథలుగా బయటపడిందని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 5లక్షల మెట్రిక్ టన్నులకూ పైగా కెపాసిటీ కలిగిన గోదాములు కట్టి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. రానున్న యాసింగిలో కూడా రైతులకు బోనస్ ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన రేషన్ కార్డుల మంజూరు, గత 21 నెలల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. రానున్న కాలంలో ప్రజలు మరింత మద్దతు తెలపాలని మంత్రి పొంగులేటి కోరారు. అనంతరం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధిసంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు , రాష్ట్ర గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు , మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ , జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , పోలీస్ కమిషనర్ సునీల్ దత్ , మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, బైరు హరినాథ్ బాబు, బొర్రా రాజశేఖర్, మద్ది మల్లా రెడ్డి, కళ్యాం వెంకట్ రెడ్డి, బండి జగదీష్, చింతమల్ల రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల నియోజకవర్గ, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు దశాబ్దాలుగా స్మశానవాటిక రోడ్డు సమస్య

- సుబ్లేడు మాల సంఘం ఆవేదన.



**తిరుమలాయపాలెం,, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు గ్రామం మాలవాడ ప్రజలు నాలుగు దశాబ్దాలుగా స్మశానవాటికకు వెళ్లే రహదారి లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వాడలో ఎవరైనా మరణిస్తే మృతదేహాలను తరలించేందుకు గ్రామస్తులు పడరాని కష్టాలు పడాల్సి వస్తోందని మాల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామ పెద్దలు చెబుతున్నట్లు ఎన్నోసార్లు అధికారుల ముందు మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని, ఎన్నికల సమయంలో వచ్చే ప్రతి నాయకుడు "చేస్తాం చూస్తాం" అంటూ వాగ్దా నాలు చేసినప్పటికీ ఎన్నికల అనంతరం ఎవరూ పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించిన వారు, వర్షాకాలంలో మట్టి రోడ్డు పూర్తిగా జారిపడడంతో మృతదేహాలను మోసుకెళ్లడం మరింత కష్టసాధ్యమవుతోందని వాపోతున్నారు. ప్రజలకు కనీస సౌకర్యం కూడా లభించడం లేదని మండిపడిన గ్రామస్తులు, ఇప్పటికైనా అధికార పార్టీ చొరవతో సీసీ రోడ్ నిర్మాణం చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. స్మశానవాటిక రహదారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు వేడుకుంటున్నారు.

## నూతనకల్లులో పలు కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నేత అనిల్ చౌదరి



**తల్లాడ, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడ మండలంలోని నూతనకల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం నాయకులు, గ్రామానికి చెందిన యువ నేత అడపా అనిల్ చౌదరి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న మధు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు కుటుంబాలను ఆయన పరామర్శించారు. జ్వరాలతో భయపడ వద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్యాణపు వెంకటయ్య, క్రిష్ణయ్య, నాగేశ్వరావు, వీరబాబు. పాల్గొన్నారు.

## తల్లాడలో అన్నపూర్ణ దేవిగా అమ్మవారు

- పూజలు చేసిన ఆలయ చైర్మన్ లగడపాటి నెహ్రూ దంపతులు





**తల్లాడ, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడలోని కోట మైసమ్మ తల్లి ఆలయంలో దసరాశరన్నవరాత్రులులో మూ డవ రోజు అమ్మవారు గాయత్రీ దేవిగా అవతారంతో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కోట మైసమ్మ తల్లి ఆలయ చైర్మన్ లగడపాటి నెహ్రూ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరగటం ఆనవాయితీ. అందులో భాగంగా భక్తులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్నారు.

## క్రాంతిలో ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం




**తల్లాడ(వైరా), సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి ):** స్థానిక ఠాగూర్ వారి ఎస్ ఆర్ క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవ వేడుక బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథం, శాస్త్రీయ దృక్పథం, అలవర్చుకుని నవ సమాజ నిర్మాణం కోసం తమ వంతు కృషి చేయాలని, తమదైన శైలిలో విలక్షణమైన పద్ధతిలో సమాజ అభివృద్ధికి, శ్రేయస్సుకు తోడ్పడాలని, మహనీయుల స్ఫూర్తి తో ముందుకు సాగాలన్నారు. చదివే చదువును పరోక్షంగా సమాజ సేవలో ప్రతిక్షేపించాలని పేర్కొన్నారు. జాతీయ సేవా పథక చిహ్నంలో నీ రంగులను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, పాటలు మొదలైన అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లింగారావు, మజీద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కవిత కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని అందులోనూ ఆడబిడ్డలు ఆనందంగా పూలతో జరుపుకునే బతుకమ్మ అతి విశిష్టమైన పండుగని కవిత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పారుపల్లి ఉషా కిరణ్ పేర్కొన్నారు. నగరంలోని స్థానిక గట్టయ్య సెంటర్ ఉపేంద్రయ్య నగర్ లో గల కవిత డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ భారతదేశంలో పూలతో జరుపుకునే పండుగ ఏదైనా ఉంది అంటే అది బతుకమ్మ పండుగే అని, నేడు బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగిందని విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. కళాశాల విద్యార్థినులు ఎంతో శ్రద్ధతో తయారుచేసిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా చేసిన నృత్యాలు ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కవిత పిజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పారుపల్లి రోజా రాణి, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి వాలెంటైర్స్ మరియు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గోపాలపురం గ్రామం లో ఎస్సీ ఇళ్లల్లోకి వర్షపు నీరు.. పట్టించుకోని అధికారులు





**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో గోపాలపురం లో ఇటీవల భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఇళ్లలోకి నీరు చేరాయి. వర్షపు నీరు ఇంట్లోకి రావడంతో పిల్లలతో ఆరుబయటకు వచ్చారు.వర్షపు నీరు తో గత కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నా పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో పిల్లలు, తాము జ్వరాల బారిన పడుతున్నామని, ఆరుబయటే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇళ్లలోకి పాములు, తెల్లు, విష పురుగులు ఇల్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంభందిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గోపాలపురం ఎస్సీ కాలనీవాసులు డిమాండ్ చేశారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య రక్త పరీక్షలు




**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి :** పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక శిబిరం 5వ రోజున వెదుళ్ళ చెరువు గ్రామంలో కొనసాగింపబడుతున్నది. ఇందులో భాగంగా లయన్స్ క్లబ్ వారి సహకారంతో డాక్టర్ రాంబాబు, డాక్టర్ పాల్వాయి నిరీష, ఆధ్వర్యంలో వాలంటీర్లతో గ్రామస్థులకు కంటి పరీక్ష, రక్త పరీక్షలు నిర్వహించబడినవి. అనంతరం సమావేశంలో సామాజిక స్పృహ గురించి కార్తికేయ వివరించారు సాయంత్రం నిర్వహించిన సామాజిక సర్వేలో వాలంటీర్లు ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరించారు. ఎన్ ఎస్ ఎస్ పి ఓ, నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కాంర్యక్రమంలో విశ్వేశ్వరరావు, చంద్రమౌళి, పరుశురాం, చామకూర ఉపేందర్ , చిలకమ్మ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## పేట చెరువు పర్యాటక అభివృద్ధికి రూ. 4-86కోట్లు మంజూరుకి హర్షం వ్యక్తం చేసిన బండారు




**ఎర్రుపాలెంప్రజా జ్యోతి :** త్వరలో పర్యాటకుల ఆకాంక్షలు నెరవేరే సమయం ఆసన్నమైందని మధిరమార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో ఎర్రుపాలెం మండలం మామునూరు పేట చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుచుట కోసం రూ. 4.86 కోట్లు నిధులు మంజూరు చేయించారు.బుధవారం మామునూరు పేట చెరువు అనువైన ప్రాంతాన్ని ఎంచుకొని ఆయా స్థల పరిశీలన చేయుటకు సంబంధిత శాఖ అధికారి ఏఈ నరేష్ నిర్దేశించిన ప్రాంతానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు తదితర నాయకులతో కలసి పనులు ప్రారంభించుటకు మార్కింగ్ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రకృతి ఆహ్లాదాలను ఆస్వాదించేందుకు పర్యాటక అభివృద్ధి కేంద్రంగా మామునూరు పేట చెరువును సుందరీకరణంగా తీర్చిదిద్దేందుకు తమ అభిమత నాయకుని కృషి మరువలేని దన్నారు. అందుకుగాను అభివృద్ధి ప్రదాతకు మండల పక్షాన ఇరువురు నాయకులు భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనుమోలు వెంకట కృష్ణారావు,సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరెంపులలో ఆనందోత్సవం పొంగులేటి క్రీమ్ కలర్ కుర్తా పైజామా ప్రత్యేక ఆకర్షణ



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఆరెంపుల గ్రామం బుధవారం పండుగ వాతావరణంలో కళకళలాడింది. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గుమ్మాల వద్ద పూలతోరణాలు... ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు గృహాల చుట్టూ వినిపించిన మంగళధ్వానాలు కొత్త జీవితానికి సంకేతాలు వెలిగించాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఈ గ్రామంలో గృహప్రవేశాలు ఘనంగా జరగగా... ముఖ్య అతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం,సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాకతో ఉత్సవం మరింత ఉప్పొంగింది. ఈ వేడుకలో మంత్రి పొంగులేటి వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా అందరి చూపులను కట్టిపడేసింది.ఆయన ధరించిన క్రీమ్ కలర్ కుర్తా పైజామా అందరి దృష్టిని తనవైపు తిప్పేసింది. గ్రామస్తులు పొంగులేటి శీనన్న సాదాసీదా స్టైల్ ఎంత బాగుందో అంటూ చర్చించుకున్నారు. కొత్తగా గృహ ప్రవేశం చేసుకున్న వారందరికీ మంత్రి పొంగులేటి అభినందనలు తెలిపి పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు.

## కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** స్థానిక కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం న్యూఢిల్లీలో ఖమ్మం ఎంపీ,స్టాండింగ్ కమిటీ సభ్యులైన రామసహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ డాక్టర్ నిషికాంత్ దూబే, రాజ్యసభ సభ్యులు, ప్రసిద్ధ తెలుగు సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, ఎంపీ, ప్రముఖ సినీనటి కంగనా రనౌత్.. పలు రాష్ట్రాల ఎంపీలతో కలిసి.. కీలక అంశాలపై చర్చించారు.

## ఆర్టీసీ ఖమ్మం డిపో డిఎంగా మేడా శివప్రసాద్ బాధ్యతల స్వీకారం

- పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన ఎస్ డబ్ల్యూ ఎఫ్ ప్రతినిధులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** స్థానిక ఆర్టీసీ ఖమ్మం డిపో నూతన మేనేజర్ మేడా శివ ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఆర్టీసీ మహబూబాబాద్ డిఎం గా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీ పై సోమవారం మధ్యాహ్నం ఖమ్మం డిపో మేనేజర్ ఛాంబర్ లో నూతన డిపో మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శివ ప్రసాద్ ను ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను అభినందిస్తూ శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.విజయదశమి పండుగ ముందు డిపో మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించటం సంతోషదాయకమని ఖమ్మం డిపోలో మీ ఉద్యోగ ప్రస్థానం విజయవంతం కావాలని ఆల్ ద బెస్ట్ సార్" అంటూ ఎస్ డబ్ల్యూ ఎఫ్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.తనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపిన అందరికీ నూతన డిపో మేనేజర్ ధన్యవాదాలు తెలిపారు.డిపో అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని డిఎం కోరారు.ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ అధ్యక్ష,కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్,ప్రచార కార్యదర్శి తోకల బాబు,డిపో కార్యదర్శి గుగ్గిళ్ళ రోశయ్య,సీనియర్ నాయకులు తోట కూర శ్రీనివాసరావు,గడ్డం అయోధ్య, అనంతారం డీవిభద్రం,వై.శ్రీను,కృష్ణయ్య,సరిత,బేబీ,గుజ్జు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవతో పార్లమెంట్ సందర్శించిన విద్యార్థులు

- ఈ అవకాశం కల్పించినందుకు పార్లమెంట్ సభ్యులు రామసహాయంకు కృతజ్ఞతలు తెలిపిన అభినవ్ స్కూల్ పిల్లలు, యాజమాన్యం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసు లేఖతో విజ్ఞాన యాత్రలో భాగంగా న్యూఢిల్లీలోని భారత పార్లమెంట్ భవన సముదాయం, పార్లమెంట్ మ్యూజియాన్ని ఖమ్మం నగరంలోని అభినవ్ స్కూల్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఇటీవల ఈ పాఠశాల యాజమాన్యం ఎంపీకి విజ్ఞప్తి చేయడంతో వెంటనే స్పందించి ఢిల్లీలోని ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక చొరవతో అక్కడ సందర్శన ఏర్పాట్లు పర్యవేక్షించడమే గాక..స్వయంగా విద్యార్థులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా..ఎంపీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, దేశ అత్యున్నత చట్ట సభను సందర్శించడం ద్వారా ప్రజాస్వామ్య గొప్పతనం,ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడాలనే ఆకాంక్ష బాల్యం నుంచే మనసులో బలపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. పార్ల మెంట్ విశేషాలు తెలియజేసి విద్యార్థు లను ప్రోత్సహించిన ఎంపీ రఘురాం రెడ్డికి అభినవ్ స్కూల్ ప్రిన్సిపాల్ పారుపల్లి అరుణ, కరస్పాండెంట్ రమణ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## మానవత్వం చాటుకున్న భూక్యా సురేష్ నాయక్



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** రెక్కాడితే కానీ డొక్కనిండని నిరుపేద కుటుంబానికి చేయూతనిచ్చి మానవత్వం చాటుకున్నారు. ది: 24/9/2025 బుధవారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాపురం కి చెందిన షేక్. గౌస్ (40), అనారోగ్య సమస్యల కారణంగా ఆసుపత్రి నందు చికిత్స చేయించుకుంటున్న విషయం స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందిన వెంటనే ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా.సురేష్ నాయక్ మానవత్వంతో వారి స్వగృహం ఎదులాపురం నందు వెళ్లి అర క్వింటా బియ్యం మరియు నిత్యావసర సరుకులు అందించి వారి కుటుంబాన్నీ ఓదార్చారు.వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎల్ల వేళల అండగా ఉంటుందని భరోసా ఇచ్చి మనోధైర్యం కల్పించారు.వారితో పాటు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ నాగార్జునపు ప్రద్యుమ్న చారి,ఎదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు వెంపటి సురేష్, ఎర్ర శేఖర్ రెడ్డి, వెంపటి వెంకన్న, సురేష్ రెడ్డి,కళ్లెం శేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సింధు వైద్యానికి ఎన్ఆర్ఐ అభిషేక్ ఆర్థిక సహాయం



**పాలేరు ఆర్సీ సెప్టెంబర్24 ప్రజా జ్యోతి:** కూసుమంచి మండలం ధర్మతండాకు చెందిన జర్పుల సింధు వైద్యానికి ఎన్ఆర్ఐ అభిషేక్ రూ.50వేల ఆర్థిక సహాయం అందించిడు. బుధవారం ధర్మతండాకు చెందిన సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లాలూ ప్రసాద్, అభిషేక్ తో మాట్లాడి ధర్మతండాకు చేరుకుని, సింధును పరామర్శించారు. తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఆర్థిక సహాయం అందించారు. సింధు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని కోరారు. ఆపదలో ఉన్నవాళ్ళకు మా సహాయం ఎప్పటికి వుంటదని భరోసా ఇచ్చిన అభిషేక్, మిత్ర బృందంకు ధర్మతండా గ్రామస్థులు, సింధు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాలు ప్రసాద్, వెంకట్, నారాయణ, భద్రు, తారచంద్, సునీల్, పుల్ సింగ్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 19 లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి జ్యోతి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** స్థానిక నవంబర్ 19 లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి క్రింద ఉన్నత చదువులకై అందించే ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారు యుఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యు.కె., సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్మొదలగు దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు వెళ్ళేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అభ్యర్థి పీజీ చదివేందుకు గ్రాడ్యుయేషన్ లో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం 5 లక్షల రూపాయల లోపు ఉండాలని, టోఫెల్,ఐఈఎల్టిఎస్., జి.ఆర్.ఈ., జి మ్యాట్, పిటిఈ లలో అర్హత కలిగి ఉండడంతో పాటు పాస్ పోర్ట్ కలిగి ఉండి విదేశీ విద్యాలయం లో ప్రవేశం పొంది ఉండాలని, వయస్సు 35 సంవత్సరాలకు మించరాదని తెలిపారు . ఆసక్తి గల ఖమ్మం జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు https://telanganaepass.cgg.gov.in ద్వారా నవంబర్ 19 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పూలనే దైవంగా పూజించే పండుగ బతుకమ్మ పండుగ

- మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాధ బాబు.



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** సంస్కృతికి, సంప్రదాయాలకు నిలయమైన బతుకమ్మ పండుగ విశిష్టత అంతా,ఇంతా కాదని మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకలు జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆటలు ఆడి, బతుకమ్మను ఎత్తుకొని, అధికారులు, ప్రజాప్రతినిధులతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలనే దైవంగా పూజించే విశిష్టమైన బతుకమ్మ పండుగ అని, ప్రతి కుటుంబంలో,ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించి,అభివృద్ధిలో ముందు ఉంచుతున్నారని అన్నారు. భావితరాలకు ఇలాంటి సంస్కృతులు అలవాటు చేయాలని తెలియజేశారు. అనంతరం ప్రతి ఒక్కరికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజ్ఙేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కందుకూరి వెంకటనారాయణ, అజ్మీర అశోక్ నాయక్, సంఘాని వెంకటేష్, మెండే వెంకటేష్, రానేరు మురళి, సాయి యాదవ్, మహిళలు,నాయకులు,అభిమానులు ఉన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ డే





**బోనకల్, సెప్టెంబరు 24,(ప్రజాజ్యోతి ):**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నళిని శ్రీ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ డే ఘనంగా నిర్వహించడం జరిగింది.మొదటిగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్ ఎస్ ఎస్ చైర్మన్ నళిని శ్రీ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం మహాత్మాగాంధీ జన్మదినం ( 1869) 100 సంవత్సరాల తర్వాత అనగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన అప్పటి కేంద్ర విద్యా మంత్రి డాక్టర్ వి కే ఆర్ వి రావు , 37 విశ్వవిద్యాలయాల్లో 400 00వేల విద్యార్థులతో ప్రారంభించడం జరిగింది.ఎన్ఎస్ఎస్ యొక్క సైద్ధాంతిక ధోరణి గాంధీ ఆదర్శాల నుండి ప్రేరణ పొందింది . జాతీయ సమైక్యతను సామాజిక సామరస్యాన్ని అభ్యసించడం శ్రమ విలువ తెలుస్తుంది. నాయకత్వ లక్షణాలను మరియు ప్రజాస్వామ్య వైఖరిని పొందడానికి ఎన్ఎస్ఎస్ దోహదపడుతుంది అని వివరించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంలో ఎన్ఎస్ఎస్ పాత్ర జాతీయ సేవా పథకం యొక్క ప్రధాన లక్ష్యం సామాజిక సేవ ద్వారా వ్యక్తిగత వికాసం విద్యార్థులలో సామాజిక , సంక్షేమ ఆలోచనలను పెంపొందించడం మరియు ఎటువంటి పక్షపాతం లేకుండా సమాజాన సేవ అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఎన్ఎస్ఎస్ యొక్క నినాదం "నాకోసం కాదు నీకోసం " సామాజిక జీవనం బాధ్యతలను పంచుకోవడానికి అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించడానికి అత్యవసర పరిస్థితులు పకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఉపయోగపడుతుంది. తమ జీవితంలో వచ్చే సమస్యలను ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారు. గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత, మూఢనమ్మకాల పైన అవగాహ సదస్సుల లో పాల్గొనడం ద్వారా సమాజ అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు దోదపడతారని తెలియజేశారు. అధ్యాపకులు జోనాతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేందర్, ప్రియ కుమార్ రెడ్డి, శాంతి ప్రియ, యు డి సీ మదర్, జస్వంత్, అరుణ విద్యార్థులు పాల్గొన్నారు.

## 6న జరిగే తెలంగాణ రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయండి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులుగుడవర్తి నాగేశ్వరరావు




**పాలేరు ఆర్సి సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి:**వచ్చేనెల 6న అక్టోబర్ జరిగే తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ సమావేశం గుడవర్తి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహిస్తున్న తెలంగాణ రైతు సంఘం, రైతుల కోసం, వ్యవసాయం ,సాగునీరు, విత్తనాలు, ఎరువులు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, గిట్టుబాటు ధర, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై అనేక రైతాంగ పోరాటలు నిర్వహించిందని, ఈ సందర్భంగా గుర్తు చేశారు.వచ్చే నెల 6న మండల కేంద్రంలోని ఎస్సార్ ఫంక్షన్ హాల్లో సుమారు 500 మంది రైతులతో పాలేరు డివిజన్ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ మహాసభలకు రాజకీయ లకు అతీతంగా రైతులందరూ హాజరై మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బిక్కసాని గంగాధర్, యడవల్లి రమణారెడ్డి, నేలకొండపల్లి రైతు సంఘం అధ్యక్ష రచ్చ నరసింహారావు, అధ్యక్ష కార్యదర్శిలు తోట పెద్ద వెంకట రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, రైతు సంఘం తిరుమలాయపాలెం మండల అధ్యక్ష కార్యదర్శి లు తుళ్లూరి నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మంతరావు పోరాడి సుదర్శన్ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తోటకూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రులు ఉత్సవాలు పాల్గొన్న భద్రాచలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్

- అయిలూరు వెంకటేశ్వర్ రెడ్డి



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి:** ఎర్రుపాలెంమండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో జాటాయువు యూత్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ఉత్సవం లో అయిలూరు వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు అందుకున్నారు బుధవారం అర్చకులు సాయి శ్రీధర్ అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. తలపురెడ్డి నాగిరెడ్డి అనూష దంపతులు పూజ కార్యక్రమం లో పాల్గొని వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రస్టుబోర్డ్ మాజీ చైర్మెన్ ఐలూరు వెంకటేశ్వర రెడ్డి గారు,యూత్ కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలి

- నిరుద్యోగ భృతిని కల్పించాలి
- 29న జరిగే మండల మహాసభను జయప్రదం చేయండి
- విస్తృత సమావేశంలో నందిపాటి మనోహర్ వెల్లడి




**బోనకల్,సెప్టెంబర్ 24,(ప్రజాజ్యోతి ):**2018 నుంచి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు దళితులకు అందటం లేదని వెంటనే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పేర్కొన్నారు మండల కేంద్రమైన బోనకల్ సిపిఎం పార్టీ కార్యాలయంలో కెవిపిఎస్ మండల విస్తృత సమావేశం మంగళవారం నిర్వహించారు. నందిపాటి మనోహర్ మాట్లాడుతూ. రాను రాను నిరుద్యోగుల జీవితాలు అగమ్యంగా మారాయని వెంటనే నిరుద్యోగ భృతి కల్పించాలని ఆయన తెలిపారు ఆనాటి 2018 నుంచి ఇప్పటివరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయ కపోవడం తో ఎన్నో కుటుంబాలు ఉపాధి లేక అలమటిస్తున్నారని ఆయన అన్నారు. వెంటనే రుణాలు మంజూరు చేసి దళిత కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీల హామీలు అమలు చేయాలని ఆయన తెలిపారు, ఈనెల 29వ తేదీన తేజ ఫంక్షన్ హాల్ నారాయణపురం రోడ్డు జానకిపురంలో జరిగే నాలుగవ కెవిపిఎస్ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ప్రతి గ్రామా గ్రామన అనేకమంది తరలివచ్చి ఈ మహాసభలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు అనంతరం మహాసభలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు నోముల పుల్లయ్య మండల కార్యదర్శి గార్లపాటి రమేష్, అధ్యక్షుడు సత్యానందం, నాయకులు ఉప్పెర శీను ఏసుపోగు బాబు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

- ఇంట్లో పని చేసిన వ్యక్తి ఇంటి నిర్మాణానికి రూ. 25000 అందజేత.



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** చిన్నప్పట్నుంచి తన ఇంట్లో పని చేసిన వ్యక్తికి గృహ నిర్మాణం చేసుకోవడం కోసం రూ. 25000 ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు వెంపటి స్వామి. ఈ ఆర్థిక సహాయాన్ని తమ కుమార్తెలు అనూష ఆశల చేతులు మీదుగా అందజేశారు. ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఎదులాపురం గ్రామంలో వెంపటి కృష్ణయ్య కుటుంబానికి కొన్ని కంటే గోపయ్య చిరకాల అభిమానులుగా ఉండటమే కాకుండా ఇంతకాలం వారింట్లో పని చేశాడు. పొన్నగంటి గోపయ్య నూతన ఇల్లు నిర్మిస్తున్నాడంతో వెంబడి కృష్ణయ్య కుమారుడు వెంపటి స్వామి రూ ఇరవై ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. చిన్ననాటి నుంచి మా ఇంట్లో సేవలందించినందున మా వంతుగా ఈ ఆర్థిక సాయం చేయడం దేవుడు మాకు ఇచ్చిన వరంగా, భావిస్తున్నామని వెంపటి స్వామి తెలిపాడు.

## వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఎం పార్టీ పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు భూక్య నాగేశ్వరరావు.



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** జిల్లాలలో ఇటీవల గాలి వానలతో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు భూక్య నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులకు మండలంలోని వర్షాల కారణంగా దెబ్బతిన్న పత్తి. మొక్కజొన్న, పెసర, తదితర వేసిన రైతులను పంట అంచనా వేసి రైతులను వెంటనే ఆదుకోవాలని కస్నతండా లో రైతులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న, భూక్య నాగేశ్వరరావు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రైతులు పంట నష్టంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులో ఉన్నారని, రుణాల భారంతో కుటుంబ ఖర్చులు విద్య ,ఆరోగ్యం ,పై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ కార్యకలాపాలను సాధించడం కూడా సవాల్గా మారిందని, తక్షణ సహాయం అందించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ తీరును మార్చుకోవాలని రుణమాఫీ కాని వారికి వెంటనే రుణమాఫీ చేయాలని, మండలాలలో యూరియా కొరత రైతన్నలను వేధిస్తుందని, దీంతో రైతులు ఒక కట్ట యూరియా కోసం గంటల తరబడి లైన్లో నిలబడ వలసి వస్తుందని ఆయన అన్నారు. రైతన్నలకు యాసంగి సీజన్లో క్వింటాలకి 500 రూపాయలు ఇస్తానన్న బోనస్ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## నేడు మల్లేపల్లి ప్రజా సమస్యలపై పరిష్కారానికై జరిగే పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి చీర్ల రాధాకృష్ణ.

**పాలేరు ఆర్సీ సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి:**పాలేరు నియోజక వర్గంలోని కూసుమంచి మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో నెలకొన్ని ఉన్న ప్రజా సమస్యలపై,గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్య, డ్రైనేజీల సమస్య, మంచినీటి సమస్య సిసి రోడ్ల నిర్మాణం తదితర సమస్యల పరిష్కారానికి నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మల్లేపల్లి గ్రామం నుండి ఉదయం 8 గంటలకు ప్రారంభమై మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర జరుగుతుందని ఈ కార్యక్రమానికి సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు, మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పాదయాత్రను జయప్రదం చేయాలని మల్లేపల్లి సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి చీర్ల రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

